




# దైవోపహతులు

వి. లక్ష్మీసుజాత

వాళ్ళు వట్టి కక్కుర్తి మనుషులని క్రమక్రమంగా అర్థమైంది నాకు. వాళ్ళు అడిగినవన్నీ రాఘవ యిచ్చుకోలేడని ఎంతగా నచ్చజెప్పినా, వినిపించుకునే ప్రయత్నం కూడా చెయ్యలేదు.

"మా వాడేం చిన్నా చితకా వుద్యోగం చేస్తున్నాడా! బ్యాంకులో! మంచి పర్సనాలిటీగల కుర్రాడు. ఈ రెండింటిని బట్టి చూసినా మేము ఎక్కువేం అడగలేదు" అని చాలా నీచమైన రీజనింగ్‌లు చూపెట్టారు. కమలాకర్ హేమను బాగా యిష్టపడ్డాడు. ఈ సంబంధం వదులుకోవాలని రాఘవకి లేదు. బాల్య స్నేహాన్ని పురస్కరించుకుని, మధ్య వర్తిత్వం నెరపే బాధ్యత నా మీద పెట్టాడు. అటు వరహాలరావూ తెలిసినవాడే అవటంవల్ల ఎటూ సర్ది చెప్పలేక సతమతమై పోతున్నాను. ఎవర్నీ నొప్పించలేకపోతున్నాను. వప్పించటం అంతకంటే కుదిరేట్లు లేదు. మొహమాటం రోగం ఒకటి.

రాఘవ పరిస్థితి నాకు తెల్సు కాబట్టి వరహాలరావునే ఒప్పించే ప్రయత్నం గట్టిగా చేశాను. ఎట్లాగో రాఘవ యిల్లు పక్కింటాయన చేతుల్లోకి పోయాక, ముప్ఫయి అయిదు వేలు నగదు, కమలాకర్‌కి ఉంగరం, గొలుసు, నాలుగు సూట్లు, వెండి పళ్లెం, చెంబు, ఆడపడుచుకి రెండువేల నూటపదహార్లు, పట్టుచీరెలు- యివన్నీ వప్పుకున్నా అయిష్టంగానే వప్పుకున్నారు.

వారం క్రితం ఒక షరతు పెట్టారు.

హేమకు మూడు తులాల గొలుసు చేయించమని అర్డర్ వేసిపోయారు: "అంత పెట్టలేం, పిల్ల మెడలో తులం బంగారం వుంది. గాజులూ జూకాలూ వున్నాయి. యిక మా వల్ల కాదు" అన్నాడు రాఘవ.

కాదూ కూడదనడంతో భారతి చేతులకు మట్టి గాజులు వచ్చాక, ఆ సమస్యా తీరింది. ఇక పెళ్ళి పదిహేను రోజుల్లో వుంది.

అమ్మయ్య, పెళ్ళయిపోయినట్టే అనుకున్నా!

యిదంతా ఎందుకు చెప్పుకొచ్చాననంటే, నిన్న వాళ్ళు మరో షరతు పెట్టారు. నిన్న వాళ్ళింటి మీదగా వస్తూంటే వాకిట్లోనే వున్న వరహాలరావు భార్య ధనలక్ష్మి "రండన్నయగారూ" అని ఆహ్వానించింది.

కబుర్లలో పెట్టి "ఆ మూడు తులాల్తో పిల్లకు చంద్రహారం చేయించమని చెప్పండి వాళ్ళకి" అంది చల్లగా!

"యిప్పటికి గొలుసు ఏదైనా చేయించారేమో! ముందే చెప్పవలసింది" అన్నాను నంగిగా!

"యిప్పుడేమయింది లెండి, చెడగొట్టి చేయిస్తారు. మా యింటి కోడళ్ళు చంద్రహారం పెట్టుకుని గృహప్రవేశం చెయ్యాలి. నేనూ, మా అత్తగారూ అలాగే వచ్చాం! చెప్పుదామనుకుని, పనుల్లో పడి మర్చిపోయాం" అంది ఘరానాగా!

నాకు చెడ్డ చిరాకేసి పోయింది, "చెప్పి చూస్తా"నంటూ త్వరగా బయటపడ్డా! చెప్పాగా మొహమాటం రోగమని.

నేనన్నట్టే అయింది. అప్పటికే మరేదో మోడల్ బాగుంటుందని ఆర్డర్ చేశారట. దాన్ని చెడగొట్టటానికి హేమ ససేమిరా యిష్టపడలా! నేనూ గట్టిగా ప్రెస్ చేయలేదు. ఏదైతేనేం బంగారమేగా! కావాలనే యిలాంటి షరతులు పెడుతున్నారని

పించింది. ఒక్కటి మాత్రం నిర్ధారించుకున్నా. యింకే పెళ్ళికీ , ముఖ్యంగా రెండువైపులా తెలిసిన వాళ్ళయితే, అట్లాంటి పెళ్ళికి మధ్యవర్తిగా వుండ కూడదని నిశ్చయించుకున్నాను. వరహాలరావు యింత కక్కుర్తికేసని నాకిప్పుడిప్పుడే తెలుస్తోంది. కాలేజీలో తెలుగు పాఠాలు కమ్మగా చెబుతుంటే, అందర్లాగే నేనూ ప్రత్యక్ష సరస్వతే అనుకున్నా లోతుకు పోతే కదా 'బురద' తెలిసేది!

"మాస్టారు వాళ్ళింత డైరెక్టుగా అవన్నీ అడుగు తారనుకోలేదు నాన్నా! కట్న పిశాచి కంఠం నరకా లనీ, ఆదర్శ వివాహాలనీ కబుర్లు బాగా చెబుతారు క్లాసులో! అవన్నీ నిజమేననుకున్నాం" అంది మా కవిత.

"ధనలక్ష్మి వత్తిడి ఎక్కువేమో! ఆమె ధోరణి అట్లాగే వుంటుంది" అంది మా ఆవిడ.

"వత్తిడి ఎక్కువైతే నోరు మూయించలేరూ! ఈయనకు కూడా తేరగా వస్తే చాలేమో! హేమ లాంటి పిల్లకు ఎదురు కట్నం యిచ్చి చేసుకో వచ్చు" కోపంగా విసుక్కుంది కవిత.

మా ఆవిడ యిచ్చిన కాఫీ తాగి "గుప్తా యింటిదాకా వెళ్ళొస్తా" అని షర్టు వేసుకుని బయటపడ్డాను.

సూపర్ బజారు దగ్గర వరహాలరావు భార్యా, వాళ్ళ పక్కింటావిడ కాబోలు కనపడ్డారు. తల వంచుకుని పోదామని ప్రయత్నిస్తూండగానే "అన్నయ్యగారూ" అని కేక పెట్టింది.

అప్పుడే చూసినట్టు నటిస్తూ, "ఆఁ ఏమ్మా" అంటూ అటువైపు నడిచాడు.

"చంద్రహారం సంగతి చెప్పారా వాళ్ళకి" నిల దీసింది.

"చెప్పానమ్మా! వాళ్ళేదో మోడల్ ఆర్డర్ చేశా రట" అన్నాను.

"నిన్న రాఘవరావు భార్య కనపడితే నేనూ చెప్పానండీ! సరేనన్నారే" అంది.

"మరింకేమమ్మా! మీరే చెప్పారుగా! యింక సమస్యేముంది" అన్నాను.

"మీరూ ఒకసారి చెప్పండి మళ్ళీ! వస్తాను! పనుంది" అంటూ గబ గబా వెళ్ళిపోయింది. గుప్తా యింట్లో లేకపోవడంతో రాఘవ యింటివైపు మళ్ళాను. పళ్ళ మార్కెట్టు దాకా వెళ్ళగానే నరసయ్య ఆహ్వానించాడు.

"రండి మాస్టారూ, దానిమ్మ పళ్ళు యిందాకే వచ్చాయి, సీడ్‌లెస్! మీరిటు రాక పోతారా అనే చూస్తున్నా! రండి రండి" తియ్యగా వున్నాయి మాటలు.

"అర డజను పళ్ళు కారీబాగ్‌లో వెయ్యి" అన్నాను.

అప్పుడు పడింది నా చూపు దాని మీద.

గులాబీ రంగు కాగితపు పొట్లం. కొంచెం ఉబ్బెత్తుగా.

ఏదన్నా ప్యాకెట్టా! లేక కిళ్ళీ తాలూకు కాగితం నలిపి పారేస్తే, యిలా కనపడుతోందా! మరేదైనా పొట్లమా! గబుక్కున మెరిసింది ఆలోచన. బంగారు వస్తువులు యిలాంటి కాగితంలోనే ప్యాక్ చేస్తుంటారు. ఆ ఆలోచన రాగానే గుండె జల్లు మంది. తీసుకోవాలా వద్దా అన్న సంఘర్షణలో రెండు నిముషాలు గడిచాయి. చివరికి వంగి తీసుకోవాలనే నిర్ణయించుకున్నాను. ఎవరన్నా నన్నే గమనిస్తున్నారేమో అనిపించి చుట్టూ చూశాను. నిజంగానే, సైకిలు షాపు మస్తాను యిటే చూస్తున్నాడు. ఎలా? ఆ ప్యాకెట్టు తీయడంగానీ వాడు చూస్తే, నాదని గోలపెడితే? పోనీ, కర్చీఫ దానిమీద పడేసి, రెండూ కలిపి తీసుకుంటే! ఈ ఐడియా కొద్దిగా బాగానే వుందనిపించి జేబులోంచి కర్చీఫ్ తీశాను. అలవోకగా పడేద్దామనుకుంటూ వుండగానే - దానిమీద పడింది ఒక హైహీలు చెప్పు తాలూకు కాలు. గుండె చిక్క బట్టినట్లయింది. గబుక్కున తలెత్తాను.



## మీకు తెలుసా?

ఎత్తైన కొండల మీద, పర్వతాల మీద శ్వాశించడం కష్టంగా ఉండటానికి కారణం ఏమిటి?

సముద్రమట్టానికి ఎత్తుగా పయనించే కొద్దీ గాలిపీడన శక్తి క్రమేణా తగ్గుతూ వస్తుంది. అంతే కాకుండా గాలిలోగల ప్రాణవాయువు యొక్క శాతం కూడా తగ్గుతుంది. అందు వలన ఎత్తైన కొండలమీద, పర్వతాల మీద గల గాలి యొక్క పీడనశక్తి ఊపిరితిత్తులలోని గాలియొక్క పీడన శక్తి కంటే తక్కువగా ఉంటుంది. అందుకే బయటగాలి లోపలికి వెళ్ళడానికి కష్టమవుతుంది. దీనివల్ల శ్వాశించ డం కష్టం అవుతుంది.

• • •

పెట్రోలు అంటుకొని మండుతున్నప్పుడు దాని మీద నీరు పోస్తే ఆ మంట ఆరదు, ఎందువలన?

నీరు పెట్రోలు కంటే బరువైనద్రవము. అందువలననే మండే పెట్రోలు మీద నీరు పోసినప్పుడు బరువైన నీరు క్రిందకు జారిపో తుంది, తేలికైన పెట్రోలు నీటి మీద తేలి, మండుతూనే ఉంటుంది.

–గౌరి

వరహాలరావు కూతురు పద్మజ.

"మామయ్యగారూ, బాగున్నారా" అంది నవ్వుతూ.

"బాగున్నానమ్మా! ఎప్పుడు వచ్చావు? మీ వారు కూడా వచ్చారా" అన్నాను యిబ్బందిగా నవ్వుతూ.

"నేను వచ్చి రెండు రోజులైంది. ఆయన పెళ్ళి రెండు రోజులుందనగా వస్తారు" అంది. వాళ్ళమ్మా పక్కింటావిడా తనూ కలిసి షాపింగ్‌కి వచ్చిన సంగతీ, వాళ్ళు సూపర్‌బజారులో వున్న సంగతీ, తను పళ్ళకోసం వచ్చిన సంగతీ, తన ఆడపడుచు లాంఛనాలపట్ల తన యొక్క అసంతృప్తీ, వాళ్ళ నాన్న బుజ్జగింపూ యిన్ని కబుర్లు చెబుతోందే కానీ కదలదే!

యిక వదిలేసుకున్నాను! అది కిళ్ళీ తాలూకు కాగితమే అని సర్ది చెప్పేసుకున్నాను. చలం అంత టాయనే చిన్న కాయితాన్ని చూసి పువ్వనుకుని పుస్తకం రాశాడు. నీరసంగా నరసయ్య యిచ్చిన పళ్ళసంచీ తీసుకుని ముందుకు కదిలాను.

రాఘవ యిల్లు చేరేసరికి యిల్లంతా నిశ్శబ్దంగా వుంది. వరండాలో హేమ చెల్లెలు రజిత కూర్చుని వుంది. తలెత్తి కూడా చూడలేదు. "అంకుల్" అంటూ నన్ను చూడగానే దగ్గరికొచ్చే పిల్ల యిలా కూర్చుంది, వాళ్ళ నాన్న మీద అలిగిందేమో అను కుంటూ, "రాఘవా" అంటూ లోపలికెళ్ళాను. రాఘవ సోఫాలో మోకాళ్ళ మీద తల పెట్టుకుని కూర్చుని వున్నాడు. తలెత్తి "రా, కూర్చో" అంటూ కుర్చీ ముందుకు జరిపాడు.

"ఏమిటలా వున్నావు" అన్నాను. అంతలో ఇంట్లోంచి రాఘవ భార్య వెక్కిళ్ళు వినపడ్డాయి. నాకు కొంచెం కంగారు వేసింది. గబుక్కున వంటింట్లోకి వెళ్ళాను. పెరట్లో హేమ తులసికోటని ఆనుకుని కూర్చుని వుంది. భారతి గడపలో కూర్చుని కన్నీళ్ళు తుడుచుకుంటోంది! "హేమా! యిలారా! ఏమైందమ్మా" అన్నాను కంగారుగా. హేమ నెమ్మదిగా వచ్చి రెండు నిముషాలు మౌనంగా నిలబడి "నాన్నగారు బంగారు గొలుసు... పోగొట్టుకున్నారంకుల్" అంది.

"వాట్" గట్టిగా అన్నాను. "ఎలా? ఎలా జరి గింది?" జారిపడ్డాయి మాటలు.

"యివాళ యిస్తానని చెప్పాడట గోల్డ్‌స్మిత్! తీసుకొస్తానని వెళ్ళారు! బిల్లుజేబులో పెట్టుకున్నా రట, షర్టు జేబులో! గొలుసు ప్యాకెట్ మాత్రం పాంట్ జేబులో పెట్టుకున్నారట. దార్లో పళ్ళ మార్కెట్ దగ్గర ఆగి, నరసయ్య దగ్గర యాపిల్స్ తీసుకున్నారట! ఇంకెక్కడా ఆగలేదు. ఇంటి కొచ్చాక చూసుకుంటే- లేదు" హేమకి దుఃఖంతో మాట ఆగిపోయింది.

"పళ్ళ మార్కెట్ దగ్గరా?" అప్రయత్నంగా అన్నాను.

"ఊఁ! గులాబి రంగు కాగితం ప్యాకెట్‌ట" అంది హేమ నెమ్మదిగా! కళ్ళు గిర్రున తిరిగాయి నాకు! అదే! అదే!! అదే!!!

"మరి పళ్ళ మార్కెట్ దగ్గర - చూశారా - వెళ్ళి వెదికారా" పిచ్చి నమ్మకంగా అన్నాను.

అంతలో స్కూటర్ చప్పుడైంది. చిన్నా లోపలికి వచ్చాడు "లేదు నాన్నా" అన్నాడు నెమ్మదిగా. పళ్ళ మార్కెట్ నుండి వచ్చాడని అర్థమైంది. నాకేం చెయ్యాలో ఏం మాట్లాడాలో, అసలు అక్కడికి నేనెందుకు వచ్చానో కూడా అర్థం కాలేదు. ఒక్క క్షణం మౌనంగా బయటికి వచ్చాను. ఈ సంగతి తెలిస్తే ధనలక్ష్మి ఏమి గోల చేస్తుందో! పెళ్ళయ్యాక పెడతామన్నా ఒప్పుకునే రకం కాదే!

ఎలా! ఎలా!! ఎలా!!! ఎంత పని చేశాను!

ఎలాగైనా సరే, వరహాలరావుకే నచ్చ చెప్పాలని నిర్ణయించుకున్నాను. నడిచే ఓపిక లేక, రిక్షా మీద వరహాలరావు ఇంటికి వెళ్ళాను.

నన్ను చూస్తూనే పద్మజ "హల్లో మామయ్య గారూ, రండి రండి" అంది హుషారుగా నవ్వుతూ.

ధనలక్ష్మి లోపలి నుండి టీ తీసుకువస్తూ "మా కోడలు యింకా పాదం మోపక ముందే, లక్ష్మీదేవి వచ్చిందండీ మా యింటికి" అంది. ఆవిడ ముఖం చాటంత అయింది.

"ఏమిటి" అన్నాను నిరాసక్తంగా చూస్తూ.

ధనలక్ష్మి ముందుకు వంగి గొంతు తగ్గించి "మన పద్మజకి పళ్ళ మార్కెట్ దగ్గర రెండు పేటల బంగారు గొలుసు దొరికింది" అన్నది సంతోషంగా!

టీ గొంతుకు అడ్డం పడి పొలమారింది. రెండు నిముషాలకుగానీ సర్దుకోలేకపోయాను. "ఆఁ" అన్నాను అయోమయంగా!

"అయ్యో. మంచి నీళ్ళు తీసుకురావే పద్మా" అంది ధనలక్ష్మి.

"మరే మామయ్యగారూ, మీరు అలా వెళ్ళగానే పళ్ళు తీసుకుని వచ్చేస్తుంటే, క్రింద ఈ పాకెట్టు ధొరికింది. మీరు నిలబడి మాట్లాడిన చోటేనండీ! నా కంటే ముందు చూసి వుంటే యిది మీకే దొరికేది. చూడండి" పద్మజ చూపిస్తోంది.

గులాబీ రంగు కాగితంలో బంగారు గొలుసు. హేమ గొలుసు. హేమది. హేమ యిష్టపడి చేయించుకున్న సైకిల్ చైన్ మోడల్ గొలుసు.

చెప్పాలా వద్దా! నా పిచ్చిగానీ, చెబితే నమ్ముతారా ఏమిటి?

ఇది హేమదే అని గ్యారంటీ ఏమిటంటారు!

చంద్రహారం చేయించమన్నాంగా అంటారు!

బంగారు వస్తువుల విషయంలో అంత అజాగ్రత్తగా ఉంటే ఎలా అంటారు. ఇదంతా మా పద్మజ అదృష్టం అంటారు!

అదంటారు యిదంటారు, ఏమైనా అంటారు

నాకెందుకో ఒక్కసారిగా గట్టిగా నవ్వాలనిపించింది. కళ్ళనీళ్ళు పెట్టుకుందామనిపించింది ఆ గొలుసు లాక్కుని పారిపోవాలనిపించింది.

ఈ గొలుసు హేమది అని అరవాలనిపించింది. కాసింత కారం తీసుకుని వాళ్ళ కళ్ళలో కొట్టాలనిపించింది.

కానీ, ఏదీ చెయ్యలేకపోయాను.

పొద్దున పక్కక్లాసులో "దైవోపహతులు- అంటే దైవంచేత ఉపహతులు, తృతీయాతత్పురుష సమాసం. అంటే, కొంత మంది అంటే దైవానిక్కూడా కోపమే! వారికే విధంగానూ సహాయం చేయకపోగా కష్టాలను, బాధలను కలిగిస్తాడు- అదీ ఆ మాటకి అర్థం" అంటూ వరహాలరావు చెప్పిన తెలుగు పాఠం తాలూకు భాగానికి, ఉదాహరణలా రాఘవ, హేమల ముఖాలు కళ్ళ ముందు కదలాడాయి. *

## కాలచక్రం వెనక్కి తిరిగితే!..



### రచయిత్రిగా...

కాలచక్రం వెనక్కి తిరిగితే ఎన్నో బాధలు గుర్తుకొస్తున్నాయి. అవమానాలు జ్ఞప్తికొస్తున్నాయి. నేను పెద్దగా చదువుకుని వుంటే 'యద్దనపూడి సులోచనారాణి'గారిలా నవలా రచయిత్రిని అయివుండేదాన్నేమో, పెద్దగా చదువుకోలేదు కాబట్టే మా అబ్బాయలనైనా సరే చదివించాలనుకున్నాను, చదివించాను. మా ముగ్గురబ్బాయిలలో ఒకరైన 'సూర్యప్రకాశరావు' నేడు కవితలు, జోక్స్, కథలు, ఇతర రచనలు చేయడమేకాక అనేక బహుమతులు అందుకుంటున్నాడు. వాడికి బహుమతి వచ్చినప్పుడల్లా కళ్ళ వెంట అశ్రుధారలు కురుస్తూంటాయి. వాడు ప్రయోజకుడు అవుతున్నాడు అనే ఆనంద భాష్పాల్లో లేక ఎటువంటి ఉద్యోగం సద్యోగంలేక ఖాళీగా వుంటున్నాడని బాధగా నయనాలు వర్షిస్తున్నాయో కూడా తెలియక ఒక్కొక్కప్పుడు మౌనంగా ఊరుకుండిపోతాను.

ఎందరో నన్ను నాటి నుండి ఎన్నో హేళనలు, అవమానాలు చేసారు, ఇంకెందరో బాధలు పెట్టారు అయినా నాకు వారి మూర్ఖత్వానికి జాలి కలిగిందే తప్ప వారిపై ఎప్పుడూ ఎటువంటి కోపం కలగలేదు. ఇప్పుడిప్పుడే అప్పుడప్పుడు చిన్న చిన్న ఆర్టికల్స్ పత్రికలకు రాస్తున్నాను.

మేడిచర్ల విజయలక్ష్మి,
రామరాజులంక



### పాలించగలను!

బంగాళాఖాతం తీరాన నెలకొన్న కుగ్రామం మాది. వేదవేదాంగ పారంగతులు జన్మించిన ప్రసిద్ధ వంశం మాది. మళ్ళు, మాన్యాలు, మాగాణి భూములు లేకపోయినా మడి, ఆచారం పాటించు పవిత్ర తెగ మాది. మా వూరిలో వేంచేసి వున్న కుంకాళమ్మ వారి గుడికి అనాదిగా అర్చకత్వం నెరవుతూ, పురోహితం చెప్తూ జీవిక వెళ్ళదీస్తున్న కుటుంబం మాది. అలాంటి ఇంట పుట్టిన నేను విద్యలో కుశాగ్రబుద్ధినై గురువుల ప్రశంసకు పాత్రురాలనయినాను. వారి సలహా మేరకు మా పల్లె కల్లా ఓం ప్రథమంగా స్త్రీ జాతి నుండి నేనే కళాశాల చదువులకు బయల్దేరదలచాను. ఆనాడు మా బామ్మగారు ఇంటిని రణస్థలి చేశారు. ఎలాగో ఆమెకు నచ్చ చెప్పి మా అమ్మ, నాన్నలు నన్ను కాలేజీకి సాగనంపారు. అక్కడ విద్యతో బాటు నా మనసు లలితకళలపై సైతంలగ్నమైంది. అంతే గాదు ఆ మహిళా కళాశాలలో ప్రతినిధిగా ఎన్నికై విద్యార్థినుల సంఘానికి అధ్యక్షురాలనయినాను. ఆ కాలంలో యువతులకు కావలసిన సౌకర్యాలను కళాశాల యజమాన్యాన్నుండి రాబట్టి అందరిలో అమిత ప్రచారం పొందాను. పేదవ మా ఆర్థికగతుల దృష్ట్యా నేను చదువును ముగించి ఒక మగనికి మగువనయినాను. ఆ రోజుల్లో మా అత్తగారి వూరి పంచాయతీని వనితలకు కేటాయించింది ప్రభుత్వం. గ్రామస్థుల దృష్టి నాపై నిలిచింది. 'విద్యావంతురాలు, సౌమ్యురాలు' అని విస్తృత ప్రచారం పొందిన నేను లోగడ కళాశాల పాలనారంగపు స్ఫూర్తిని, ఉత్తేజాన్ని ఊపిరిగా ఉరకలువేసే ఉత్సాహంతో ఎలక్షన్లపైపు దృష్టి సారించాను. అదృష్టవశాత్తూ మావారు, అత్త, మామలు సైతం ఏకగ్రీవంగా నన్ను పంచాయితీ సర్పంచ్‌గా ఎన్నుకొనుటకు సమ్మతించారు. అయితే ఈ చివరి దశలో మా బామ్మగారు వచ్చి రంగప్రవేశం చేశారు. నా ఆశలు, ఆశయాలపై నీళ్ళు చల్లినారు. మా వాళ్ళంతా, మా వూరివారంతా నా ఈప్సితాన్ని గౌరవించినా జీవితంలో చరమదశలో వున్న బామ్మగారికి ఎదురాడలేకపోయారు. వంశగౌరవం, సంస్కృతి కట్టుబాట్లు, ఆంక్షలపట్ల మక్కువగల ఆ పెద్దావిడకు మారుమాట చెప్పలేకపోయారు. తదుపరి కాలంలో ఆవిడ కాలధర్మం చెందారు. ఇప్పుడే గనక అలాంటి సువర్ణావకాశం వస్తేనా! ఫొటోకు పుష్పమాల తగిలించి వున్న మా బామ్మకు క్షమాపణ పలికి ఎన్నికల బరిలో దిగి నా ప్రతిభను వినియోగించగలను. విద్యావేత్తగా సర్కారు వారి లొసుగులను లోటు పాట్లను సరిదిద్ది పాలనా రథాన్ని ప్రగతి పథంలో నడిపించగలను.

–మోదెం కృష్ణవేణమ్మ
లేబూరు